# కాంగ్రెస్‌కు ఓటు వేస్తే కష్టాలు తప్పవు..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షకీల్ (ఇన్‌సెట్లో) బీఆర్ఎస్ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభిస్తూ..



- **నియోజక వర్గ అభివృద్ధిని విస్మరించిన సుదర్శన్‌రెడ్డి..**
- **నవీపేట రోడ్‌షోలో బోధన్ ఎమ్మెల్యే షకీల్**

నవీపేట, అక్టోబర్ 31: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే ప్రజలకు మరోసారి కష్టాలు తప్పవని బోధన్ బీఆర్ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్ అన్నారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఎన్నికల కార్యాలయాన్ని స్థానిక నాయకులతో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన సభలో షకీల్ మాట్లాడుతూ.. 60 ఏండ్ల పాలనలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసిందేమీ లేదని మండిపడ్డారు. గతంలో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఐదేండ్లు మంత్రిగా పనిచేసిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి బోధన్ నియోజకవర్గాన్ని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో భారీ నీటి పారుదల శాఖ మంత్రిగా కొనసాగిన సుదర్శన్‌రెడ్డి .. నవీపేట మండలంలో ఒక్క చెక్‌డ్యామ్ చేపట్టిన దాఖలాలు లేవని మండిపడ్డారు. తాము తొమ్మిదేండ్లలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. రూ. 10 కోట్ల వ్యయంతో నిజాంపూర్, లింగాపూర్ చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టి నాళేశ్వర్, తుంగిని తదితర ఎన్నో గ్రామాలకు సాగునీటిని అందిస్తున్నామని తెలిపారు. ఇటీవల రూ. 80 కోట్లతో బినోలా లిఫ్టును మంజూరు చేసినట్లు చెప్పారు. కరోనా సమయంలో నియోజకవర్గ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటే ఒక నీటి బాటిల్ సైతం అందజేయని సుదర్శన్‌రెడ్డికి ఓట్లు అడిగే హక్కులేదన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అధిష్టానం రెడ్డిలకే ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చి, బీసీలను విస్మరించిందన్నారు. కాంగ్రెస్‌కు దమ్ముంటే బీసీ వ్యక్తిని సీఎం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు బీజేపీ బోధన్ నుంచి అభ్యర్థిని ప్రకటించలేదని, ఆ పార్టీ పరిస్థితి ఏంటో తెలుస్తోందన్నారు. బోధన్ నియోజక వర్గంలో బీఆర్ఎస్‌కు పోటీ లేదని, ఒకవేళ ఉంటే బీజేపీతోనే అని అన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని ఆయన అభ్యర్థించారు.

# మంత్రి వేములకు బద్దంవాడ రైతుల మద్దతు



మోర్తాడ్‌లో మంత్రి ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా నినాదాలు చేస్తున్న రైతులు

మోర్తాడ్, అక్టోబర్ 31: అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి మోర్తాడ్ బద్దంవాడ రైతులు మద్దతును ప్రకటించారు. ఈమేరకు మంగళవారం రైతులంతా బద్దంవాడలో నిల్చొని జై బీఆర్ఎస్.. జై ప్రశాంతన్న , జై కేసీఆర్ అంటూ నినాదాలనిచ్చారు. బద్దంవాడకు ఏ నాయకుడు చేయనన్ని అభివృద్ధి పనులు వేముల చేశారని తెలిపారు. కల్వర్టు నిర్మాణానికి రూ.కోటిన్నర నిధులు మంజూరు చేశారని అన్నారు. ఎన్నికల్లో తమ పూర్తి మద్దతు ప్రశాంత్‌రెడ్డికేనని ప్రకటించారు.

## పోలింగ్ సిబ్బంది జాగ్రత్తలు పాటించాలి

**ఎన్నికల రిటర్నింగ్ అధికారి, బోధన్ ఆర్డీవో రాజాగౌడ్**



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

బోధన్, అక్టోబర్ 31: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆయా పోలింగ్ కేంద్రాల్లో అధికారులు, ఉద్యోగులు ఎలాంటి పొరపాట్లు జరుగకుండా విధులు నిర్వహించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, బోధన్ ఆర్డీవో బి. రాజా గౌడ్ సూచించారు. పట్టణ శివారులోని ఆచన్‌పల్లి ఇందూర్ బీఈడీ కళాశాలలో ఎన్నికల రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణలో భాగంగా ఆయన పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాలు, ఆయా సెంటర్లకు విధులు కేటాయించిన వారు సకాలంలో హాజరు కావాలని సూచించారు. పోలింగ్ మెటీరియల్‌ను సరిచూసుకోవాలన్నారు. ముందుగానే ఈవీఎంలను పరిశీలించాలని, వాటి పనితీరును పలువురు శిక్షణా అధికారులు వివరించారు. సమావేశంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# కేసీఆర్ సభను విజయవంతం చేయాలి

- **గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలి**
- **బీఆర్ఎస్ నాయకుల పిలుపు**



కమ్మర్‌పల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

కమ్మర్‌పల్లి/భీమ్‌గల్/మోర్తాడ్/బాల్కొండ/ మెండోరా/వేల్పూర్/ఏర్గట్ల, అక్టోబర్ 31: వేల్పూర్ మండలంలోని స్పైస్ పార్కులో ఈ నెల 2న నిర్వహించనున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల నాయకులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం మండల కేంద్రాల్లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. బాల్కొండ నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ సహకారంతో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చేసిన అభివృద్ధి ప్రజల కళ్ల ముందే ఉందన్నారు. మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా, మంత్రి ప్రశాంత్‌రెడ్డిని మరోసారి గెలిపించేందుకు ప్రజలు ఉత్సాహంతో ఉన్నారన్నారు. తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిపిన కేసీఆర్ హ్యాట్రిక్ సీఎంగా చరిత్ర సృష్టించబోతున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, రైతులు, యువకులు, అభిమానులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. వేర్వేరుగా మండల కేంద్రాల్లో నిర్వహించిన సమావేశాల్లో కమ్మర్‌పల్లి , భీమ్‌గల్, మోర్తాడ్, బాల్కొండ, మెండోరా, ఏర్గట్ల బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్, దోనకంటి నర్సయ్య, బద్దం ప్రవీణ్‌రెడ్డి, నాగంపేట్ శేఖర్‌రెడ్డి, ఎనుగందుల రాజపూర్ణానందం, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# ఇంటింటికీ బీఆర్ఎస్

**బోధన్ నియోజకవర్గంలో జోరుగా ఎన్నికల ప్రచారం**

బోధన్, అక్టోబర్ 31: పట్టణంలోని పలు వార్డుల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అందించే సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. మన సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా ఉన్నాయని, ఈ విషయం ప్రజలు గుర్తించాలని కోరారు. 29వ వార్డులో బీఆర్ఎస్ నాయకుడు పూజారి లింగం, కార్యకర్తలు ప్రచారం చేశారు.

**సాలూరాలో..**

బోధన్ రూరల్, అక్టోబర్ 31: సాలూర మండల కేంద్రంలో రైతు బంధు సమితి మండల మాజీ కన్వీనర్ బుద్దెరాజేశ్వర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ పదేండ్లలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. బోధన్ మండలంలో షకీల్‌కు మద్దతుగా నిర్వహించిన ప్రచారంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ధర్మయ్యగారి సంజీవ్‌కుమార్, భవానీపేట్ లక్ష్మణ్, పులేందర్ పాల్గొన్నారు.



సాలూర మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకుల ఇంటింటా ప్రచారం



బోధన్ పట్టణంలోని 29వ వార్డులో సంక్షేమ పథకాలపై ఇంటింటా అవగాహన కల్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**నర్సాపూర్‌లో ..**

శక్కర్‌నగర్, అక్టోబర్ 31: బోధన్ పట్టణం 4వ వార్డులోని నర్సాపూర్ గ్రామంలో వార్డు కౌన్సిలర్ డేగావత్ దూప్‌సింగ్ నాయక్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో ఎస్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు ప్రవీణ్‌జాదవ్, నాయకులు ఎండీ ఉస్మాన్ పాల్గొన్నారు.

**రెంజల్ మండలంలో..**

రెంజల్, అక్టోబర్ 31: మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి షకీల్ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో బీఆర్ఎస్ మైనార్టీ జిల్లా నాయకుడు మౌలానా, రామాలయ కమిటీ చైర్మన్ సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక**

తాడ్‌బిలోలి గ్రామ పంచాయతీ 9వ వార్డు సభ్యురాలు శాంతాబాయి కాంగ్రెస్ పార్టీకి గుడ్‌బై చెప్పి జిల్లా మైనార్టీ నాయకుడు మౌలానా అధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. రిటైర్డ్ ఉద్యోగి పెంట గంగాధర్ బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో రామాలయ కమిటీ చైర్మన్‌సుధాకర్‌రావు, మల్లసాయిలు, మాజీ చైర్మన్ అబ్బన్న, మాజీ ఉప సర్పంచ్ అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

**ఎడపల్లిలో..**

ఎడపల్లి, అక్టోబర్ 31: ఎడపల్లిలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. షకీల్‌ను మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రచారంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీరాం, సొసైటీ చైర్మన్ పోల మల్కారెడ్డి, ఉప సర్పంచ్ అకుల శ్రీనివాస్, ఎంపీటీసీలు స్రవంతీ పోతన్న, మనీషా రెడ్డి నాయకుడు ఎల్లయ్య యాదవ్, కార్యకర్తలు పాల్గొన్నారు.



తాడ్‌బిలోలిలో బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ఆసక్తిగా చూస్తున్న బీడీ కార్మికురాలు



బోధన్‌లోని 4వ వార్డు నర్సాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు